**జరిగిన కథ :** కారణజన్ముడై పుట్టిన శ్రీదర్శనుడు జూదక్రీడ వల్ల ఆస్తి మొత్తం కోల్పోయాడు. ముఖరకుడు అనే మిత్రుడు అతణ్ని ఆత్మహత్యా ప్రయత్నం నుంచి విరమింప చేశాడు. మిత్రులిద్దరూ కలిసి యాత్రలు చేస్తుండగా.. ఒక అడవిలో శ్రీదర్శనుడికి ఒక అందమైన కన్య కనిపించింది.






అనుసృజన: **నేతి సూర్యనారాయణ శర్మ**

# సాహసాన్ని మెచ్చిన భేతాళుడు

"నా పేరు పద్మిష్ట. మాది సుఘోషమనే అగ్రహారం. మా తల్లిదండ్రులకు మేం ఇద్దరు పిల్లలం. మా అన్న ముఖరకుడు జూదరియై ఇల్లు పట్టకుండా తిరుగుతుండేవాడు. వాడి చర్యలతో బెంగటిల్లిన మా తల్లి మరణించింది. ఇంతలో మా అన్న దేశాలు పట్టిపోయాడు. దాంతో నన్ను వెంటబెట్టుకుని మా తండ్రి ఉజ్జయినికి ప్రయాణం కట్టాడు. అలా ఈ అడవికి చేరుకున్నాం. ఇక్కడికి దగ్గరలో ఒక భిల్లుగూడెం ఉంది. దానిని వినాయకుడనే వాడు పాలిస్తున్నాడు. వాడొక బందిపోటు దొంగ. అడవికి వచ్చే బాటసారులను దోచుకుంటాడు. వాడు మా తండ్రి తల బద్దలుకొట్టి దోచుకున్నాడు. నన్ను తన కొడుక్కిచ్చి పెళ్లి చేయడం కోసం తన ఇంట్లోనే బంధించాడు. ఆ కొడుకిప్పుడు దొంగతనాల కోసం దేశాలమీదికి వెళ్లాడట. వాడింకా రాలేదు కాబట్టి నేను బతికిపోయాను. రేపోమాపో వాడికి బలైపోవాలి. మీరు ఈ ప్రాంతాన్ని గురించి తెలియకపోవడం వల్ల ఇక్కడికి వచ్చినట్లున్నారు. తొందరగా వెళ్లిపోండి" అని చెప్పిందామె.

సరిగ్గా ఆమె మాటలు పూర్తవుతుండే సమయానికి ముఖరకుడు అక్కడికి వచ్చాడు. చెల్లెల్ని గుర్తించాడు. తండ్రి మరణానికి చింతించాడు.

"అన్నా! నేనెక్కువసేపు ఇక్కడే ఉంటే వినాయకుడికి అనుమానం వస్తుంది. ఇప్పుడు గూడెంలో మగవాళ్లెవరూ లేరు. వినాయకుడు మాత్రమే ఉన్నాడు. ఒక్కడే అయినా వాడితో ప్రమాదమే" అన్నది పద్మిష్ట.

శ్రీదర్శనుడు అప్పటికప్పుడు ఒక ఉపాయం ఆలోచించాడు. దానిప్రకారం పద్మిష్ట ఊళ్లోకెళ్లింది. చెరువుగట్టున ఎవరో బాటసారులు ఉన్నారని వినాయకుడితో చెప్పింది. దోచుకోవడానికి ఏదైనా దొరుకుతుందనే ఆశతో అతను వచ్చాడు. ఈలోపుగా ముఖరకుడు ప్రాణావసాన దశలో ఉన్నట్లు నటించసాగాడు. అతని ముందు కూర్చుని శ్రీదర్శనుడు పెద్దగా రోదించసాగాడు. వినాయకుడు మెల్లిగా అతని దగ్గరికొచ్చి..

"ఏమైంది బాబూ!" అని అడిగాడు.

"ఇతను నా మిత్రుడు. ఇప్పుడో మరికాసేపట్లోనో అన్నట్లున్నాడు. ప్రాణాలు పోయేముందు తన సంపదనంతా దానం ఇవ్వాలనుకుంటున్నాడు. ఇక్కడికి దగ్గరలో ఎవరైనా బ్రాహ్మణులు ఉన్నారా?" అని ప్రశ్నించాడు అమాయకంగా శ్రీదర్శనుడు.

"లేకపోవడమేం.. తీసుకొస్తానుండండి" అంటూ వినాయకుడు వెళ్లాడు.

తానే బ్రాహ్మణ వేషం ధరించి వచ్చాడు.

"దానం ఇచ్చేముందు కాళ్లు కడగనివ్వండి" అంటూ వినాయకుణ్ని ఎత్తి చెరువులో పడేశాడు ముఖరకుడు.

వాడు తలకిందులుగా చెరువులో పడ్డాడు. కాళ్లు రెండూ ఆకాశాన్ని చూస్తున్నాయి. క్షణం ఆలస్యం చేయకుండా చెరువులో దూకిన శ్రీదర్శనుడు ఆ కాళ్లను దొరకబుచ్చుకున్నాడు. తన రెండుకాళ్ల మధ్యలో వాడి నడుమును బిగించి వేశాడు. కొద్దిసేపటికే ఊపిరాడక భిల్లునాయకుడు ప్రాణం విడిచాడు.

ఆటంకం తీరడంతో పద్మిష్టతో కలిసి స్నేహితులిద్దరూ చకచకా అక్కణ్నుంచి కదిలారు. కానీ, పదిరోజులపాటు ప్రయాణం చేసిన తరువాత కానీ ఆ అడవికి అంతం కనిపించలేదు. చివరికి మాళవదేశ రాజధాని అయిన శోభానగరానికి చేరుకోగలిగారు.

ముగ్గురూ ఆ నగర సౌందర్యాన్ని గమనిస్తూ వీధుల వెంట నడుస్తున్నారు. ఒకచోట భవన ద్వారానికి ముందు ఒక ప్రకటన కనిపించింది.

'ఇది సత్రము. ఇక్కడ జూదరులకు మాత్రమే భోజనం పెట్టబడును' అని రాసి ఉందా ప్రకటనలో.

"చూశావా.. మిత్రమా! ఆఖరికి మనవంటి జూదగాళ్లను కూడా ఆదరించే నగరానికి చేరుకోగలిగాం. బహుశా జూదంలో బాగా లాభాలు గడించినవాడెవడో ఈ సత్రం కట్టించి ఉంటాడు" అన్నాడు శ్రీదర్శనుడు నవ్వుతూ.

ముగ్గురూ లోపలికి వెళ్లి సత్రం అధికారిని చూశారు.

"అయ్యా! మేము దూరదేశస్థులం. జూదంలో ఐశ్వర్యమంతా కోల్పోయి, కట్టుబట్టలకు కూడా కరువు వాచిపోయాం. మాకు గదులిచ్చి, భోజనం పెడతారా!?" అని అడిగారు.

"దానికేం" అంటూ ఆ అధికారి అప్పటికప్పుడు వారిపేర్లు పద్దుల్లో రాసుకున్నాడు.

భోజనాలు పూర్తయిన తరువాత మిత్రులిద్దరూ మళ్లీ సత్రం అధికారి దగ్గరికి చేరుకున్నారు.

"కాశీ, గయల్లో యాత్రలు చేసేవారికి సత్రాలు వేసినట్లు.. మీరిలా జూదరులకు సత్రం నిర్మించడం ఎందుకు?! మీ ఈ నిర్ణయానికి ఏదైనా కారణముందా?" అని ప్రశ్నించాడు శ్రీదర్శనుడు.